సాక్షి
తిరుపతి
గురువారం । 30 । జనవరి । 2025



ఈవీఎం గోడౌన్ తనిఖీ

రేణిగుంట సమీపంలో ఈవీఎంలను భద్రపరిచన గోడౌన్‌లను కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. - 8లో



వణికిస్తున్న ఘీం'కరి'!

చంద్రగిరి నియోజకవర్గంలో అటవీ సమీప గ్రామాల్లోని ప్రజలను ఏనుగులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. - 8లో



పనపాకంలో విషాదం

చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో బుధవారం కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. - 8లో

న్యూస్‌రీల్

మహిళా వర్సిటీలో అడ్మిషన్‌కు దరఖాస్తులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళావర్సిటీలో పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రధానంగా మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (సంగీతం), మాస్టర్ ఆఫ్ కామర్స్, మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (తెలుగు), డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం) కోర్సులలో ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు ఫారం, అర్హత, ఫీజు, కోర్సు వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఇతర వివరాలకు 0877-2284524, 8121787415 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

టెక్‌ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21వ తేదీ నుంచి నిర్వహించనున్న జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ పోస్టర్‌ను బుధవారంవిడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ఉమ మాట్లాడుతూ విద్యుత్సావ్-2కె25, మెకేరెనా-2కె25 పేరుతో జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్‌ను వర్సిటీలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, ఎస్‌ఓఈటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, ప్రొఫెసర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్సుకు ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు పాలిటెక్నిక్ డిప్లొమో రెండో ఏడాదిలో ప్రవేశం కోసం అర్హత పరీక్షకు బ్రిడ్జి కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తిరుపతి పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్థులు ఐటీఐ, పదో తరగతి సర్టిఫికెట్ల జిరాక్స్‌లు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 31వ తేదీలోపు తమ కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వీరికి ఫిబ్రవరి 21వ తేదీ వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఐటీఐలో 60 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 85000 21856 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రేపటి వరకు 'టీఐఎస్'కు గడువు

తిరుపతి అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీఐఎస్) వివరాల నమోదుకు, ఎడిట్ ఆప్షన్‌కు ఈ నెల 31వ తేది వరకు గడువు పెంచినట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వారు నమోదు చేసుకున్న వివరాలు ప్రకారమే జరుగుతాయని స్పష్టం చేశారు. అయితే గడువులోపు వివరాలు నమోదు, సవరణ చేయని వారికి మరో అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో మైలురాయిని అధిగమించింది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్ 15 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసింది. మువ్వన్నెల ఖ్యాతిని దిగంతాలకు చాటింది. సెకండ్ జనరేషన్ ఉపగ్రహం నావిక్-2ను సమర్థవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో నావిగేషన్ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ప్రతిష్టాత్మక వందో ప్రయోగం పకడ్బందీగా పూర్తి కావడంతో షార్ శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. నిప్పులు చిమ్ముకుంటూ నింగికేగుతున్న రాకెట్‌ను వీక్షించి సందర్శకుల్లో ఉత్సాహం ఉరకలేసింది.

వందనం.. అభినందనం


సగర్వంగా రోదసీలోకి దూసుకువెళుతున్న జీఎస్ఎల్‌వీ ఎఫ్15 (ఇన్‌సెట్) నిప్పులు చిమ్ముతూ పయనిస్తున్న రాకెట్


మూడు దశలతో రోదసీ దిశగా వెళుతున్న రాకెట్


మొదటిదశ పూర్తి కావడంతో రెండోదశతో ప్రయాణం..


హీట్‌షీల్డ్స్ విడిపోతున్న దృశ్యం


రాకెట్‌లోని రెండోదశ మండుతూ..


మూడోదశ అంటే క్రయోజనిక్ దశలో ఉపగ్రహాన్ని కక్ష్య దిశగా తీసుకెళుతూ..


నావిక్-2 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదిలిపెడుతూ..

విజయవంతంగా జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ప్రయోగం

- నిప్పులు చిమ్ముకుంటూ నింగికేగిన రాకెట్
- కక్ష్యలోకి చేరిన నావిక్- ఉపగ్రహం
- షార్ శాస్త్రవేత్తల్లో అవధులు దాటిన ఆనందం
- ప్రతిష్టాత్మక మైలురాయిని అధిగమించిన ఇస్రో

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి బుధవారం ఉదయం 6.23 గంటలకు జీఎస్ఎల్‌వీ ఎఫ్15 రాకెట్ విజయవంతంగా రోదసీలోకి దూసుకెళ్లింది. మొత్తం ప్రయోగం 19.10 నిమిషాల్లోనే పూర్తయింది. 2,250 కిలోలు బరువు కలిగిన నావిక్-2 ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి చేరింది. నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఐఆర్ఎన్ఎస్ఎస్‌కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు సెకెండ్ జనరేషన్ ఉపగ్రహమైన నావిక్-2ను ఇస్రో శాస్త్రవేత్తలు ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టారు. ఈ ప్రయోగంతో షార్ సగర్వంగా సెంచరీ మైలురాయి మీద నిలబడింది. ఇస్రో ప్రయోగాల పరంపరలో ఎన్నో మైలురాళ్లు దాటింది. అయితే ఇది వందో ప్రయోగం కావడంతో చరిత్ర పుటల్లోకెక్కింది.

గ్యాలరీలో వీక్షకుల సందడి

జీఎస్ఎల్‌వీ ఎఫ్15 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి సుమారు 6 వేల వరకు తరలివచ్చారు. వందో ప్రయోగం కావడంతో తెల్లవారుజామునే మంచును సైతం లెక్క చేయకుండా వీక్షకుల గ్యాలరీలోకి చేరుకున్నారు. రోదసీలోకి రాకెట్ దూసుకెళతుంటే జయహో భారత్,.. జయహో ఇస్రో.. అంటూ నినాదాలు చేశారు. జాతీయ జెండాలను చేతపట్టి సగర్వంగా కేరింతలు కొట్టారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్లు, బస్సులు బారులు తీరి కనిపించాయి.

శుభాకాంక్షల వెల్లువ

జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ప్రయోగం విజయవంతం కావడంపై ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. వంద ప్రయోగాలు పూర్తి చేసి చరిత్ర సృష్టించినందుకు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఇతర శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.


గ్యాలరీ నుంచి రాకెట్ ప్రయోగం వీక్షిస్తున్న ప్రేక్షకులు

దశలవారీగా ప్రయోగం ఇలా..

- జీఎస్ఎల్‌వీ ఎఫ్15 రాకెట్‌కు మంగళవారం వేకువజామున 2.53 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 27.30 కౌంట్‌డౌన్ సమయంలో రాకెట్‌లోని లిక్విడ్ స్ట్రాపాన్ బూస్టర్లలో ద్రవ ఇంధనం నింపే ప్రక్రియను చేపట్టారు.
- బుధవారం ఉదయం 6.23 గంటలకు కౌంట్‌డౌన్ ముగిసిన వెంటనే 0.00 నిమిషాలకు కోర్ అలోన్ దశలో 138.1 టన్నుల ఘన ఇంధనం, రాకెట్‌కు చుట్టూ వున్న నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లులో నింపిన 170.7 టన్నుల ద్రవ ఇంధనం మండించి మొదటిదశను 151.2 సెకెండ్లకు పూర్తి చేశారు.
- రాకెట్‌లోని రెండోదశను 149.6 సెకెండ్లకు మండించి 151.2 సెకెండ్లకు పూర్తి చేశారు. ఈ దశలోనే రాకెట్ శిఖరభాగంలో ఉపగ్రహానికి అమర్చిన హీట్‌షీల్డ్స్ 237.42 సెకెండ్లకు విడిపోయాయి.
- రాకెట్‌లోని మూడోదశ అంటే క్రయోజనిక్ దశను 295.68 సెకెండ్లకు మండించి 1135.38 నిమిషాలకు కటాఫ్ చేశారు. మళ్లీ 1140.38 సెకెండ్లకు క్రయోజనిక్ ఇంజిన్ మండించి 1147.38 సెకెండ్లకు (19.10 నిమిషాలు) 2,250 కిలోలు బరువు కలిగిన నావిక్-2 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టి సెంచరీ ప్రయోగాన్ని విజయవంతగా కేవలం 19.10 నిముషాల్లో పూర్తి చేశారు.

నాలుగు విఫలం.. 13 సఫలం

జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇస్రో ఇప్పటి వరకు 17 ప్రయోగాలు చేసింది. అందులో 13 ప్రయోగాలను విజయవంతం కాగా, కేవలం నాలుగు ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. బుధవారం నిర్వహించిన జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ఈ సిరీస్‌లో 17వ ప్రయోగం. ఇది వందో ప్రయోగం కావడంతో శాస్త్రవేత్తల్లో కొంత టెన్షన్ వుంటుంది. ఎందుకంటే 2010 ఏప్రిల్ 15న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన క్రయోజనిక్ దశతో చేసిన జీఎస్ఎల్‌వీ డీ3 ప్రయోగం విఫలమైంది. అదే సంవత్సరం డిసెంబర్ 25న జీఎస్ఎల్‌వీ ఎఫ్6 ప్రయోగంలో రష్యన్ క్రయోజనిక్ దశతో చేసినప్పటికీ విఫలమైంది. ఈ రాకెట్ నింగివైపునకు వెళ్లేటపుడు క్రయోజనిక్ దశ కిందిభాగంలో వున్న స్టడ్ విరిగిపోవడంతో మిషన్ కంట్రోల్ రూమ్ నుంచే బ్లాస్ట్ చేశారు. తర్వాత 2010 నుంచి 2014 దాకా జీఎస్ఎల్‌వీ ప్రయోగాల జోలికే ఇస్రో పోలేదు. క్రయోజనిక్ ఇంధనం లిక్విడ్ ఆక్సిడైజర్, లిక్విడ్ హైడ్రోజన్ కలిపి మైనస్ 220 డిగ్రీల ఉష్ణోగ్రతలో తయారు చేయాల్సి ఉంటుంది. అందుకే సంక్లిష్టమైన క్రయోజనిక్ టెక్నాలజీని అందుకోవడానికి తొలి నాళ్లలో కాస్త ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ నేడు సగర్వంగా నిలబడింది.


2010 డిసెంబర్ 25న విఫలమైన జీఎస్ఎల్‌వీ ఎఫ్6 రాకెట్‌ను బ్లాస్ట్ చేసిన దృశ్యం (ఫైల్)

హైవే పెండింగ్ పనుల పరిశీలన

చంద్రగిరి : మండలంలోని పనపాకం వద్ద ఆగిపోయిన జాతీయ రహదారి నిర్మాణ పనులను ఆర్‌డీఓ రామ్మోహన్ పరిశీలించారు. బుధవారం ఈ మేరకు తహసీల్దార్ శివరామసుబ్బయ్యతో పెండింగ్ పనులపై చర్చించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ పనపాకం నుంచి రవణప్పగారిపల్లె వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర హైవే పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. ప్రసుతతం తాత్కాలికంగా సింగిల్ రోడ్డు ఏర్పాటు చేశారని వెల్లడించారు. ఇరుకుగా మారిన ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పలువురి ప్రాణాలు పోతున్నాయన్నారు. అందుకే రహదారి నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు చరయలు చేపడుతున్నామని వివరించారు. ఈ మేరకు నిర్వాసితులతో కలెక్టర్ సైతం మాట్లాడారని, పరిహారం త్వరితగతిన చెల్లించేందుకు చొరవ తీసుకున్నట్లు తెలిపారు. హైవే పూర్తి చేస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 70,610 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 17,310 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.78 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

శాస్త్రోక్తంగా తై అమావాస్య పూజలు


ఊరేగింపుగా భరద్వాజతీర్థానికి వేంచేపు చేస్తున్న ఆదిదంపతులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని భరద్వాజ తీర్థంలో బుధవారం శాస్త్రోక్తంగా తై అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరునికి విశేష అభిషేకాలు జరిపించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను చప్పరాలపై కొలువుదీర్చి ఊరేగింపుగా భరద్వాజతీర్థానికి వేంచేపు చేశారు. ఆదిదంపతులకు పసుపు, చందన, కుంకుమ, విభూది, పాలు, నారికేళం, పెరుగు, పంచామృతం తదితర ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. విశేష పూజల అనంతరం ఆదిదంపతులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు.

కూటమి నేతల బరితెగింపు

బలం లేకపోయినా ఆధిపత్యం నిరూపించుకోవాలనుకుంటున్నారు. కార్పొరేటర్లను ప్రలోభపెట్టి పీఠం దక్కించుకోవాలని కుయుక్తులు పన్నుతున్నారు. కూటమి నేతల కుట్రలను పటాపంచలు చేసేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు సన్నద్ధమవుతున్నారు.

- డిప్యూటీ మేయర్ అభ్యర్థికి బెదిరింపులు
- దొడ్డిదారిలో పీఠం ఎక్కేందుకు కుట్రలు
- గతంలో గోడ దూకిన వారు సైతం వైఎస్సార్‌సీపీలోకి వచ్చేందుకు యత్నం
- పార్టీ మారినా.. కూటమిలో విలువ లేదని ఆవేదనలో కార్పొరేటర్లు



సాక్షి ప్రతినిధి, తిరుపతి : 'మీ అంతు చూస్తాం.. మీకు సంబంధించిన ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో మాకు తెలుసు. అన్నిటినీ ధ్వంసం చేస్తాం. డిప్యూటీ మేయర్ పోటీ నుంచి విరమించుకో' అంటూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను కూటమి నేతలు బెదిరించినట్లు విశ్వసనీయ సమాచారం. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధిష్టానం నేరుగా రంగంలోకి దిగినట్లు తెలిసింది. కార్పొరేటర్లకు అండగా నిలబడింది. తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అధికారం చేతిలో ఉంది కదా అని.. బలం లేకపోయినా దౌర్జన్యంగా అయినా డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకునేందుకు కూటమి నేతలు బరితెగిస్తున్నారు. 50 డివిజన్లలో టీడీపీకి దక్కింది ఒకే ఒక్క స్థానం. మిగిలిన వాటిలో 48 డివిజన్లను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోగా.. ఒక డివిజన్ ఎన్నిక కోర్టులో ఉంది. మేయర్, రెండు డిప్యూటీ మేయర్లుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో డిప్యూటీ మేయర్‌గా ఉన్న భూమన అభినయరెడ్డి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన పదవికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా డిప్యూటీ మేయర్ పదవి కోసం 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. మరో వైపు కూటమి నేతలు తమకు బలం లేకపోయినా పదవిని దక్కించుకునేందుకు కుట్రలకు తెరతీశారు.

బలం లేకపోయినా..

కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బలం లేకపోయినా కార్పొరేషన్‌ని కైవసం చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. అందులో భాగంగా కొందరు కార్పొరేటర్లను బెదిరించి, మరి కొందరికి ముడుపులు ఇచ్చి తమ వైపు లాక్కున్నారు. మిగిలిన వారిని కూడా రకరకాలుగా ప్రలోభాలకు గురిచేశారు. అయినా వారి ప్రయత్నాలు ఫలించలేదు. అధికారం, డబ్బులు ఆశ చూపితే.. కూటమిలో చేరుతారని, వారితో ఏకంగా మేయర్ పీఠం, డిప్యూటీ మేయర్ పదవును దక్కించుకోవచ్చని పన్నాగాలు పన్నిన టీడీపీ, జనసేన నేతల ఆశలు గల్లంతయ్యాయి. వారు అనుకున్నంత మంది కార్పొరేటర్లు కూటమిలో చేరలేదు. ఇప్పటికే వెళ్లిన 12 మంది కార్పొరేటర్ల పరిస్థితి ప్రస్తుతం కుడితిలో పడిన ఎలుకలా మారింది. కూటమిలో వారికి విలువ లేకపోవడం, నాయకులు చులకనగామాట్లాడుతుండడంతో మింగలేక కక్కలేక ఇబ్బంది పడుతున్నారు. వీరిలో కొందరు తిరిగి సొంత పార్టీలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అయినప్పటికీ కూటమి నేతలు తమ కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నారు. అందులో భాగంగా శేఖర్‌రెడ్డిని పోటీ నుంచి తప్పించాలని పన్నాగాలు పన్నుతున్నారు. శేఖర్‌రెడ్డి కుటుంబాన్ని బెదిరించేందుకు యత్నించినట్లు సమాచారం.

కూటమిలోనే కుమ్ములాటలు

డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమి నేతల్లో కుమ్ములాటలు సాగుతున్నాయి. టీడీపీ నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికైన ఆర్‌సీ మునికృష్ణ తొలి నుంచి ఆశావహుడిగా ఉన్నారు. టీడీపీ నుంచి పోటీచేసిన వారిలో గెలిచిన ఏకైక కార్పొరేటర్ ఇతనొక్కరే. వైఎస్సార్‌సీపీ నుంచి కూటమి పంచన చేరిన మరో ఇద్దరు కార్పొరేటర్లు సైతం డిప్యూటీ మేయర్ పదవిని ఆశిస్తున్నారు. ఎవరికి వారు పైరవీలు సాగిస్తున్నారు. పనిలో పనిగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పోటీలో లేకుండా చేయాలని కొంత మంది గూండాలతో బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. బుధవారం ఈ క్రమంలోనే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును జనసేన నేతలు కలిసి డిప్యూటీ మేయర్ పీఠంపై చర్చించినట్లు సమాచారం. అయితే కూటమి నేతలు ఎన్ని కుతంత్రాలు చేసినా.. విజయం తమదే అని వైఎస్సార్‌సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.83,530
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,608

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.93,000
రిటైల్ వెండి గ్రాము	రూ.96.00

క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్ తనిఖీ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట సమీపంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపరిచిన గోడౌన్‌లను కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ మేరకు గోడౌన్ షట్టర్లకు వేసిన తాళాలు, సీసీ కెమెరాలను పరిశీలించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సుధారాణి, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాద్, తహసీల్దార్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రేణిగుంట (ఏర్పేడు) : ఏర్పేడు మండలం మేర్లపాక దళితవాడ బస్ స్టాప్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. నిందితుల నుంచి 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

టీడీపీ నేతలకు చుక్కెదురు

రేణిగుంట: రెండు పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డులు సభ్యులుగా గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఎన్నికను రద్దు చేయాలని టీడీపీ నాయకులు వేసిన పిటీషన్‌ను బుధవారం తిరుపతి కోర్టు డిస్మిస్ చేసింది. వివరాలు.. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో రేణిగుంట మండలం నుంచి గాజులమండ్యం సర్పంచ్‌గా గంగారి రమేష్, 14 మంది వార్డు సభ్యులు, అత్తూరు సర్పంచ్‌గా డి.ప్రసాద్, పదిమంది వార్డు సభ్యులు వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలుపొందారు. వారి ఎన్నికను రద్దు చేయాలని అదే సంవత్సరంలో స్థానిక టీడీపీ నాయకులు తిరుపతి ప్రిన్సిపల్ సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. వేశారు. బుధవారం న్యాయమూర్తి వాణిశ్రీ టీడీపీ నాయకులు వేసిన పిటీషన్ ఆమోదయోగ్యంగా లేదని డిస్మిస్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు గంగారి రమేష్, ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమపై టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా కేసు వేశారని అన్నారు. న్యాయమే గెలుస్తుందనేందుకు ఇదొక ఉదాహరణ అని తెలిపారు.

వణికిస్తున్న ఘీంకరి!

గజరాజుల ఘీంకారాలతో అటవీ సమీప గ్రామాలు మార్మోగుతున్నాయి.. ఏనుగుల మాట వినపడితేనే పల్లెలు గజగజా వణుకుతున్నాయి. మదపుటేనుగుల దాడిలో పంట పొలాలు ధ్వంసమవుతున్నాయి. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత పంచాయతీలో యథేచ్ఛగా స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ క్రమంలో అన్నదాతలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. భీ'కరి' ఆలోచనలతో కంటి మీద కునుకు లేకుండా అవస్థలు పడుతున్నారు. ఆరుగాల కష్టం కళ్లెదుటే ధ్వంసమవుతుంటే దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. పరిహారం సంగతి దేవుడెరుగు.. పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం మాత్రం స్పందించని అటవీశాఖ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.


యల్లంపల్లి సమీపంలోని దోనిమడుగు వద్ద ఏనుగులు తొక్కి నాశనం చేసిన వరి పంట

- గజగజలాడుతున్న గ్రామాలు
- వణుకుతున్న అన్నదాతలు
- పల్లెల్లోకి చొరబడుతున్న ఏనుగులు
- గజబీభత్సంతో ధ్వంసమవుతున్న పంటలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న ప్రజలు
- ముఖ్యమంత్రి ఇలాకాలో హడలెత్తిస్తున్న గజరాజులు

చంద్రగిరి : మండలంలోని అటవీ సమీప గ్రామాల్లో ఏనుగుల దాడులు ఇటీవల పెరిగిపోయాయి. కనిపించిన పంటలు, మామిడి, అరటి తోటలను ఆరగించి నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నరామాపురం, కొండ్రెడ్డికండ్రిగ, యల్లంపల్లె, మామడిమానుగడ్డ, బి.కొంగరవారిపల్లెలో నిత్యం ఏనుగుల మంద దాడులకు దిగుతోంది. దీనిపై ఫారెస్ట్ అధికారులు సరైన రీతిలో చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏనుగుల కారణంగా పరిహారం చెల్లించకపోవడంతో అన్నదాతల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి.

ఈ నెలలోనే మూడు దాడులు

ఈ నెలలోనే ఏనుగుల గుంపులు మూడు సార్లు గ్రామాలపై దాడులకు పాల్పడినట్లు పల్లెవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరిమేందుకు యత్నిస్తే మరింతగా రెచ్చిపోతున్నాయని వాపోతున్నారు. దీంతో పంటలను వదిలేసి, ప్రాణాలను కాపాడుకోవాల్సిన దుస్థితికి చేరుకున్నామంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈక్రమంలోనే సోమవారం రాత్రి యల్లంపల్లె చెరువు వద్ద తిష్ట వేసిన ఏనుగులు పలువురు రైతుల పంటలు, మామిడితోటలను ధ్వంసం చేసినట్లు వెల్లడిస్తున్నారు.


ఏనుగుల దాడిలో మృతి చెందిన ఉప సర్పంచ్ రాకేష్ (ఫైల్)


గ్రామాల్లో పర్యటిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

ప్రాణాలను హరిస్తున్నా చర్యలు శూన్యం

ఈ నెల 19వ తేదీన కందులవారిపల్లె ఉప సర్పంచ్ రాకేష్ చౌదరిని ఏనుగులు హతమార్చాయి. అయినప్పటికీ అటవీ అధికారుల తీరు మారలేదని రైతులు, ప్రజలు మండిపడుతున్నారు. రాత్రుల్లో ఏనుగులు దాడులకు పాల్పడుతున్న సమాచారం అందిస్తే కనీసం స్పందించడం లేదన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరుసటి రోజు తీరిగ్గా వచ్చి తూతూమంత్రంగా పరామర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

గస్తీ పెడుతున్నాం

గతంలో అటవీ సమీప గ్రామాల చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేశాం. అయితే కందకాలు పూడిపోవడంతో ఏనుగుల గుంపులు తరచూ వస్తున్నాయి. కందకాలు పునరుద్ధరించడానికి అంచనాలను ఉన్నతాధికారులకు పంపించాం. వీటికి తోడు సోలార్ హ్యాంగింగ్ ఫెన్సింగ్ ఏర్పాటుకు కూడా అంచనాలను రూపొందిస్తున్నాం. నిత్యం అటవీ సమీప గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రాత్రివేళల్లో గస్తీ పెడుతున్నాం.

– పరమేశం, డీఆర్‌ఓ, ఏ.రంగంపేట బీట్

దాక్కునే పరిస్థితి వచ్చింది



2014 నుంచి ఏనుగుల దాడులు నిత్యకృత్యమయ్యాయి. యల్లంపల్లె చెరువు నుంచి తోటలు, పంటలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఏనుగులు గ్రామాలపై రావడంతో ఇళ్లలోనే దాక్కునే పరిస్థితి వచ్చింది. పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తుంటే అధికారులు వచ్చి వెళుతున్నారే తప్ప పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. ఇప్పటికే ఏనుగుల దాడి కారణంగా ఓ నిండు ప్రాణం పోయింది. ఇకనైనా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకుని గజరాజుల నుంచి పంటలు, ప్రాణాలను కాపాడాలి.

– ధనప్రకాష్ రెడ్డి, రైతు, యల్లంపల్లె

పునరావృతం కాకుండా చూడాలి



ఇంత భారీ స్థాయిలో ఏనుగుల మంద దాడులు నా జీవితంలో చూడలేదు. దశాబ్దం క్రితం ఓ రైతు పొలం వద్ద నిద్రిస్తుంటే ఏనుగులు దాడి చేసి గాయపరిచాయి. ఇప్పుడు ఏకంగా ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఏనుగుల మంద దాడులపై చర్యలు తీసుకోవాలి. కందకాలు పూడిపోవడంతో గజరాజుల రాక సులభతరమైంది. అటవీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– వాసుదేవ నాయుడు, రైతు, యల్లంపల్లె

ప్రాణాలతో ఉంటాం అనుకోలేదు



మూడు తరాలుగా ఇక్కడే జీవిస్తున్నాం. సోమవారం రాత్రి 9.45 గంటలకు ఏనుగుల మంద మా ఇంటి ఆవరణలోకి వచ్చింది. ఇంటి ముందు ఉన్న అరటి, మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. ఆ సమయంలో అటవీ అధికారులకు సమాచారం ఇస్తే అక్కడకు రావడం కుదరలేదన్నారు. రాత్రంతా నిద్రలేకుండా గడిపాం. ప్రాణాలలో ఉంటాం అనుకోలేదు. ఇకనైనా అధికారులు చొరవ చూపి ఏనుగుల బెడద నుంచి మమల్ని రక్షించాలి.

– మోహన్ రెడ్డి, రైతు, దోనిమడుగు


విరిగిన మామిడి చెట్లు


ధ్వంసమైన అరటి చెట్లు చూపుతున్న రైతు


ఏనుగుల తొక్కేసిన ఫెన్సింగ్

దళిత రైతుల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త రాగూర్

తిరుపతి రూరల్ : దళిత రైతుల అభ్యున్నతికి వ్యవసాయ పరిశోధన కేంద్రాలు కృషి చేస్తున్నట్లు శాస్త్రవేత్త డాక్టర్ కేఆర్ రాగూర్ తెలిపారు. బుధవారం పెరుమాళ్లపల్లెలోని చెరుకు పరిశోధన కేంద్రంలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక పథకం కింద అవగాహన సదస్సు నిర్వహించారు. చెరుకులో యాజమాన్యం, బెల్లం తయారీలో మెలకువపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాగూర్ మాట్లాడుతూ దళిత రైతుల జీవన ప్రమాణాల పెంపునకు పరిశోధన కేంద్రాలు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం యూరియా, పొటాష్, వర్మీకంపోస్టు, జీవన ఎరువులు, కలుపు మందులను పంపిణీ చేశారు కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సరళ, కో–ఆర్డినేటర్ డాక్టర్ నాగమణి, డాక్టర్ వసంత, డాక్టర్ శ్రీవల్లీదేవి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


మురళి మృతదేహం

దొరవారిసత్రం : జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. వివరాలు.. దొరవారిసత్రం మండలం నెలబల్లికి చెందిన చిట్టిబోయిన మురళి(44) బైక్‌పై రోడ్డు దాటుతుండగా అపాచీ కంపెనీకి చెందిన బస్సు ఢీకొంది. దీంతో మురళి అక్కడికక్కడే మరణించాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చాటూరు మండలంలో..

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని ముడియూరు గ్రామంలో అడవిమిట్ట మలుపు వద్ద కారు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం పానగల్ మిట్టకండ్రిగకు చెందిన గణేష్(32), లక్ష్మయ్య(38) సొంత పని నిమిత్తం బైక్‌పై పిచ్చాటూరుకు వచ్చి తిరుగుప్రయాణంలో ఉండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన బస్సు

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి కొర్లగుంటకు చెందిన జి.ప్రదీప్ అనే నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి బుధవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదీ తరపు న్యాయవాది కె.చక్రవర్తి కథనం మేరకు.. తిరుపతి, రేణిగుంట రోడ్డు, చైతన్య పురానికి చెందిన శ్యామ్‌సుందర్ వద్ద ప్రదీప్ 2020 డిసెంబర్ 9వ తేదీన రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న సొమ్ము చెల్లించే క్రమంలో 2022 మే 13వ తేదీన శ్యామ్‌సుందర్‌కు రూ.5లక్షల విలువైన చెక్కు ఇచ్చాడు. అది బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఈ మేరకు ప్రదీప్‌కు శిక్ష విధించారు. అలాగే పరిహారం కింద రూ.5లక్షలు చెల్లించాలని పేర్కొన్నారు.

పనపాకంలో విషాదం

- కాలువలో పడి మూడేళ్ల బాలుడి మృతి

చంద్రగిరి : మండలంలోని పనపాకం పంచాయతీలో ఘోరం జరిగింది. మూడేళ్ల బాలుడు కాలువలో పడి మృతి చెందడంతో స్థానిక పాతపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. చంద్రగిరి మండలం పనపాకం గ్రామానికి చెందిన లోకేష్ ఆచారి అలియాస్ సిద్ధయ్య, శరణ్య దంపతులకు ముగ్గురు సంతానం. బుధవారం తై అమావాస్య సందర్భంగా సిద్ధయ్య ఆచారి తన తండ్రి సమాధి వద్ద నివాళులర్పించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద అన్నయ్యతో కలిసి తేజ(3) ఆడుకుంటున్నారు. తల్లి శరణ్య ఇంటి పనిలో నిమగ్నమైంది. ఇంతలో నాన్న వద్దకు వెళ్లేందుకు అన్న బయలుదేరడంతో తేజ కూడా అనుసరించాడు. మార్గం మధ్యలోని స్వర్ణముఖి నది కాలువను దాటే క్రమంలో కొట్టుకుపోయాడు. ఈ విషయం ఎవరూ గుర్తించలేదు. ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడు కనిపించకపోయేసరికి కుటుంబీకులు ఆందోళన చెందారు. అంతకు ముందే ఓ గుర్తు తెలియని పాత సామాన్ల వాహనం రావడంతో, బాలుడిని వారు అపహరించుకెళ్లినట్లు అనుమానించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, బాలుడి ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. ఈ క్రమంలో కాలువలోని చెట్ల పొదల్లో తేజ మృతదేహం గుర్తించి వెలికితీశారు. కుమారుడి మృతదేహం చూసి కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లి శరణ్యను ఓదార్చడం నిస్తేజంగా కూర్చోవడం చూపరులను కలచివేసింది.


బిడ్డ మృతదేహం వద్ద తల్లి శరణ్య(ఇన్‌సెట్)తేజ(ఫైల్)

‘ఐసాన్’ సామాజిక సేవ

- రూ. 30లక్షలతో బాలిక ఉన్నత పాఠశాలలో వసతుల కల్పన


పాఠశాల ఎదుట ఐసాన్ పరిశ్రమ ప్రతినిధులు, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో కార్పొరేషన్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా జపాన్‌కు చెందిన ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా పరిశ్రమ సత్యవేడు బాలికల ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో రూ.30 లక్షల వ్యయంతో వసతులు కల్పించింది. మీటింగ్ హాల్, మరుగుదొడ్లు, సిక్‌రూమ్, వంటగదుల మరమ్మతులు , క్రీడామైదానం అభివృద్ధి, మొక్కలకు నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసింది. పాఠశాలలో వసతులు కల్పించడంపై ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకాయి సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ తరహాలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో శ్రీసిటీ ఫౌండేషన్ నిబద్ధతను వివరించారు. బాలికలు చదువు, క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఐసాన్ ప్లాంట్ హెడ్ యూచిటొమిట, కో–ఆర్డినేటర్ తోపీహిరో సనా, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ గోపాల్, డిప్యూటీ మేనేజర్ గ్లోరీ, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్రకుమార్, ప్రిన్సిపల్ వాణి, డీపీ రాజు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

గూడూరురూరల్ : పట్టణంలోని అశోక్ నగర్‌లో బుధవారం ప్రమాదశాత్తు ఓ పూరిల్లు దగ్ధమైంది. వివరాలు.. రమణయ్యకు చెందిన పూరింటి పక్కన బాణసంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు పడి మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

వంట మనిషిపై ఫిర్యాదు


ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యాకమిటీ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల వంట మనిషి చెంగల్‌రాయుడు మద్యం సేవించి వస్తున్నాడని ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్‌కు విద్యా కమిటీ చైర్మన్ భావన, వైస్ చైర్మన్ అర్జునయ్య, ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెంగల్‌రాయుడు మద్యం సేవించి అధ్వానంగా వంట చేస్తున్నాడని, దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై పలుమార్లు హెచ్చరించినా ప్రయోజనం లేకుండా పోయిందని మండిపడ్డారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నాయుడుపేటటౌన్ : మండలంలోని పండ్లూరు గ్రామ సమీపంలో రహదారి పక్కనే గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బాబీ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ఒంటిపై చొక్కాలేదని, సిమెంట్ రంగు ఫ్యాంట్ ఉందని వెల్లడించారు. అతిగా మద్యం తాగి మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాసులిచ్చుకో.. కావల్సింది తీసుకో..!

- సి.మల్లవరంలో బరితెగించిన సచివాలయ సిబ్బంది

తిరుపతి రూరల్ : మండలంలోని సి.మల్లవరం పంచాయతీలో సచివాలయ సిబ్బంది బరితెగించారు. కాసులకు కక్కుర్తి పడి ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వ రికార్డులు అప్పగించేస్తున్నారు. ఈ మేరకు కొందరు ఇష్టారాజ్యంగా తమకు కావాల్సిన రికార్డులను బీరువాలోకి తీసుకుని వెళ్లిపోతున్నారు. సిబ్బంది నిర్వాకాలపై ఇప్పటికే అనేక పర్యాయాలు ఫిర్యాదులు వచ్చినా.. ఆధారాలు లేకపోవడంతో సర్పంచ్, వార్డు సభ్యులు మిన్నకుండి పోయారు.

పట్టపగలే..

ఇన్నాళ్లకు అవినీతి ఉద్యోగుల పాపం పండింది. మంగళవారం మధ్యాహ్నం సి.మల్లవరం సచివాలయానికి నవీన్, షావలీ అనే ఇద్దరు వ్యక్తులు వచ్చారు. నేరుగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ సీట్‌కు వెనుక వైపు ఉన్న బీరువాను తెరిచారు. అత్యంత కీలకమైన హౌసింగ్ రిజిస్టర్‌ను తీసుకుని, అందులోని కొన్ని పేపర్లను ఫొటోలు తీసుకున్నారు. జిరాక్స్ కోసం కొన్ని పేపర్లు పట్టుకెళ్లేందుకు యత్నించారు. దీనిపై సమాచారం అందుకున్న సర్పంచ్ మొక్కల భారతి వెంటనే సచివాలయానికి వచ్చారు. హౌసింగ్ రిజిస్టర్ పరిశీలిస్తున్న నవీన్, షావలీని అడ్డుకున్నారు. రికార్డు ఎందుకు తీశారని నిలదీశారు. దీంతో సదరు వ్యక్తులు అక్కడి నుంచి బయటకు పరుగులు తీసి పరారయ్యారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్, డీపీఓకు సర్పంచ్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రికార్డులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శుభాభినందన


షార్ కేంద్రంలో జీఎస్‌ఎల్‌వీ ఎఫ్15 రాకెట్ ప్రయోగానికి కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్‌డీఓ కిరణ్మయి యాదవ్ హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షించారు. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో చైర్మన్ నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌కు శుభాభినందనలు తెలిపారు.

– సూళ్లూరుపేట